వకుళ

రాయసము వేంకటశివుడు గారు, యం. ఏ.,

అవి శీతకాలపు సెలవులు. నామిత్రుఁడు ఆదిశేషు ఆహ్వానము చేయఁగా కలకత్తా వెళ్లితిని. అతఁ డక్కడ వైద్యపరీక్షకుఁ జదువుచుండెను. హౌరా రెయిలు స్టేషనుయొద్ద నాకై కనిపెట్టుకొనియుండి, నాపేరుపెట్టి పిలుచుచుండినను, వాని నేనానవాలు పట్టలేక పోయితిని! క్రాపుజుట్టుపెట్టి, పింజెకట్టుగట్టి, కాళ్లకు బూట్సుతొడిగియున్న వానిని జూచి బంగాళావాఁ డేమో యనుకొంటిని! వాని యుచ్చారణయు బంగాళీయులదె! అదివఱ కెన్నఁడు నాదేశము చూడకపోవుట చేత, నాకన్నియు నచటఁ గ్రొత్తవె. ఆదిశేషు నాకచటి తన యాంధ్రస్నేహితులను, బంగాళీ మిత్రులను జూపించెను. అతనితోఁ బోయి నేననేక ప్రదేశములు చూచితిని. మూలికారామము, కాళికాదేవాలయము, వస్తుప్రదర్శనశాల, జైనుల బంగరుగుడి, సార్వభౌమిక గ్రంథాలయము—ఇవి యన్నియు నాకతఁడు చూపించి, వీనిని గుఱించిన వినోదాంశములు విశదపఱచెను. ఏ నూతనలోకసందర్శనము చేయునట్టుగనో నాకుఁ దోఁచెను!

ఒకనాఁడు నామిత్రుఁ డేదో పనియందుండుటచేత, నే నొంటరిగ నగరసంచారార్థమేగితిని. ఆరోజున హుగ్లీనది కవతలయొడ్డునందలి బేలూరునం దేదో మహాసమావేశము అయ్యెను. పాటలు, పద్యములు, ప్రసంగములు, హరికథలును నాకుఁ దెలియని బంగాళీభాషలో జరిగెను. వీనిని బురస్కరించుకొని యనేక మేళములు గానవచ్చెను. అనేక యుపాహారములు, పానీయములును విక్రయింపఁబడెను. అచట వేసినపందిళ్లు, గుడారములును ప్రేక్షకులతో నిండిపోయెను. అనేకభాషలు మాటాడెడి స్త్రీపురుషు లందు విహరించుచుండిరి. ఇంతలో సాయంసమయ మయ్యెను. ఆవలియొడ్డునకు మరలఁ గొనిపోవుటకు చిన్నపొగనావల గుమి యపుడు నదిదాటివచ్చెను. వెంటనే ప్రజలలో నొక్కుమ్మడిగ సంచలనము గలిగెను. పడవలలో ముందు గూర్చుండుటకై ప్రజలు వేవేగముగఁ బరువులెత్తిరి. అంత తొందరగఁ బరుగులిడ నా కుద్దేశము లేకున్నను, నదీప్రవాహవేగమునఁ గొట్టుకొనిపోవు కొయ్యకంబమువలె నేనును కాలికి బుద్ధి చెప్పితిని. కొందఱితోఁ గలసి నే నెట్టకేల కొకపొగపడవలో గూర్చుంటిని.

పడవ పాయఁ ద్రోయునపుడు, టిక్కెట్లు ఇచ్చువాఁడు వచ్చెను. టిక్కెట్టు కొనవలెనని చొక్కా జేబులోఁ జేయిపెట్టితిని. వేళ్లకుడబ్బు సంచి గానరాదు! ఒకవేళ ప్రక్కజేబులో సంచి యుండవచ్చునని యక్కడ వెదకితిని. అచటను సంచిలేదు! "అయ్యో, ఇంకేమి గతి!" అని యొక కేకపెట్టి, నాయలజడికి నేనే సిగ్గుపడితిని. దగ్గఱనుండు నొకస్థూలకాయుఁడు

"ఛీ! ఛీ!" యని బంగాళీలో నన్నుఁ బ్రశ్నించెను. నాకాభాష తెలియదని యింగ్లీషునఁ జెప్పఁగా నాంగ్లమున నాతో నతఁడు మాటాడఁజొచ్చెను.

"నీవు మంద్రాజీవా?" యని బంగాళీయుఁడు.

"ఆంధ్రుఁడను" అని నేను.

"సొమ్ము పోఁగొట్టుకొంటివా?"

"ఔను నాడబ్బుసంచీ పోయినది. ఫలాహారము చేయునపుడు సంచితీసి, తిరిగి జేబులో నుంచితిని. ఎట్లో మాయమై పోయినది!"

"ఇంత జనసమ్మర్దముగ నుండుచోట సొమ్ము పోవుట కేమి యాశ్చర్యము! నీకీ యూరు క్రొత్తదా?"

"వారము క్రిందటనే యిచటఁ జదువు నొక స్నేహితునిఁ జూచుటకు వచ్చితిని."

"నీ కెంత లెక్క కావలయును?"

"అర్ధరూపాయి చాలును. ఐన నేను క్రొత్తవాఁడనే, నన్ను మీరెట్లు నమ్మి బదులీయఁగలరు?"

"దానికేమి లెండి. ఆపదలందు అందఱమును బందుగులమె! ఈమాత్రము సాయము దొరకని యీ దేశమును గుఱించి క్రొత్తవాఁడవు నీవేమను కొందువు?"

అని యాపురుషుఁడు మందహాసము చేయుచు, అర్ధరూపాయి నాచేతనుంచెను. ఆయనకు వందనము లిడుచు. నేను టిక్కెట్టు కొనుక్కొని, ఆతని విలాసమడిగి, మఱునాఁడే యాయన సొమ్మిచ్చివేసెదనని చెప్పితిని.

"ఈభాగ్యము నాకు ముట్టజెప్పుటకై మఱియింత సొమ్ము కర్చుపెట్టుకొని, నాయొద్దకు నీవు శ్రమపడి రావలయునా?" అని యాయన పలికెను.

"సమయమునకు సాయముచేసిన సత్పురుషుల ఋణముదీర్చి, వారియెడల కృతజ్ఞుఁడనై యుండుట నావిధి గదా!" అని నేనంటిని.

అంతట మేము లోకసమాచారములు చెప్పుకొను చుండఁగనే నావ యొడ్డుచేరెను. ఆయన యనుజ్ఞఁగైకొని, నేను బసచేరితిని.

౨

బంగాళీభాషగాని, కనీసము హిందీ హిందుస్థానీలలో నేదైనఁగాని, రానివారు కలకత్తా నగరసంచారము చేయుట కష్టము. ఆంగ్లేయ విద్యాపరిచితులును జనసమూహము వలెనే దేశభాషలోనే ప్రాయికముగ సంభాషింతురు. సతతము తెలుఁగునేస్తకాండ్రు పరివేష్టింపఁగా తమిళవాసన బొత్తిగ దరికి రాకుండఁ జేసికొనుటయె ముక్తి యనుకొని, ఏండ్లకొలఁది తిరువళిక్కేణివీథులలో తిరుగులాడుచుండు నాకు, ఈకొద్ది దినములలో దూరదేశపు బంగాళీభాష పట్టుపడునా? కావున బంగాళీ బాగుగఁ దెలిసిన యాదిశేషును వెంటఁదీసికొని, మఱునాఁటి మధ్యాహ్నము అప్పుతీర్చుటకై ప్రఫుల్లచంద్ర నియోగిగారియింటికిఁ బైనమైతిని. మేమున్న బౌబజారునకు మిక్కిలి దూరమున

నున్న చిత్పూరురోడ్డు పరిసరములనుండెడివారి గృహ మెట్టకేలకుఁ జేరితిమి. ఆ గృహమున తెనుఁగుజాడలు కొన్ని గానవచ్చెను. మమ్మును జూచి ప్రఫుల్లబాబు, తాను బీల్చుచుండిన హుక్కాగొట్టము నోటినుండితీసి, మా కది యందియ్యఁబోయెను. అభ్యాసము లేదని మే మది స్వీకరింపమైతిమి. అంతట మువ్వురము ప్రసంగమునకుఁ జొచ్చితిమి

ప్రఫుల్లబాబునకు మద్రాసువా రనిన యభిమానము మెండు. తమ యింటిపేరు "నియోగి" యగుటకుఁ గారణమేమని నేనా యన నొకటిరెండుసారు లడిగితిని. ఆదిశేషు అపుడందుకొని, "బాబుజీ, నా మిత్రుఁడు నియోగిశాఖీయుఁడు. మీతోఁ జుట్టఱికము గలపవచ్చుననెడి యాసచేతనే తరిచి తరిచి మిమ్మీప్రశ్నలు వేయుచుండుటలేదు గదా!" అని చిఱునవ్వు నవ్వుచు ననెను.

మందహాసము చేయుచు ప్రఫుల్లబాబు, తెలుఁగుదేశమునందలి నియోగుల వృత్తాంత మంత మమ్మడిగెను. నేనుకొంతసమాధానము చెప్పితిని.

"నియోగులలో నేవైన ప్రసిద్ధగుణము లున్నవా? వా రెద్దానియం దాఱితేఱి యుందురు?" అని బాబు మరల నన్నడిగెను.

నేను ప్రత్యుత్తర మీయఁబోఁగా, తా నందుకొని యాదిశేషు, "ఈకాలపు నియోగులు పలువురు ఉన్నది యూడ్చివేసికొని, సుష్ఠుగ సువారము లారగించుటయందు సుప్రసిద్ధులు: గోదావరి విశాఖపట్టణ మండలముల వారు మీసములు పెనవేసి చుట్టలు తగుఁ బెట్టుటయందును, కృష్ణా, గుంటూరు వారలు తిరిపమెత్తి పూఁటకూళ్లుపెట్టుటయందును, ఆఱితేఱియున్నారు!" అనిపలికెను. మేము మువ్వురము పక్కున నవ్వితిమి. ఆదిశేషున కిట్టి కటువగుమాటలు స్వతస్సిద్ధమే! వైదికజన్మమెత్తిన యాతఁడు నియోగులమీఁదికిఁ దాడివెడలి, హాస్యరౌద్రరసములు వారిమీఁదికిఁ గురిపించి, తన చమత్కారమునకు మురియుచుండును! ఐనను ఆంతర్యమున నియోగులను గుఱించి యతనికి వైరబుద్ధిలేదని నే నెఱుఁగుదును.

అంతట నియోగిబాబు, "వానికేమి దేశమున మనమందఱము నిపుడు చేయు ఘనకార్యములే యివి! కాని నాకుఁ గావలసినది నియోగుల కేప్రత్యేక విద్యలందైన ప్రవీణత గలదాయని—వారి కేకళలందైన నైపుణ్యమున్నదా? ఉన్నట్టు నా కెవరో చెప్పిరి" అనెను.

అంత మరల ఆదిశేషు అందుకొని, "వారిలో నిపుడు మహాసంస్కర్తలు బయలుదేరి, మంచిప్రయోజకులైనారు! తమ వారు, ఊర్ధ్వపుండ్రములు చిదుపఁగూడ దనియు, శ్రాద్ధపిండములు మెదపవచ్చుననియుశాసించుచున్నారు! ఇవియె వీరి విద్యాప్రవీణతలు!" అని పలికి, నియోగుల యధికతకు తిరిగి తిలోదకసమర్పణము చేయసమకట్టెను!

ఇది లెక్క సేయక నేనందుకొని, కొంత కాలమునుండి వైదిక కార్యభారము తమమీఁద లేక, లౌకికవ్యాపారములకే నియోగింపఁబడిన నియోగులు, ఎక్కువ తీతిక గలిగి, లలితకళలందును, ముఖ్యముగ కవిత్వమందును నిపుణతఁగాంచి యున్నారని చెప్పి, ఆంధ్రకవులలోఁ బలువురు నియోగులుండుట దీనికి దృష్టాంతముగఁ బేర్కొంటిని.

అంతట బాబు, "ఔను. నేనిదే వింటిని. అయ్యో, మన ప్రసంగములలో ఫలాహారము సంగతి మఱచితినే! బొకులీ! బొకులీ! ఒల్పో హార్......" అని క్రిందకి కేకవేసెను.

3

పదునాల్గు వత్సరముల లేఁబ్రాయమున నుండు నొకసుందరి, చేత తళతళమను పళ్లెర ముంచుకొని, మేడమెట్లెక్కి వచ్చెను. వెంట నొకపిల్లవాఁడు తేనీళ్ల జారియు, మిల్లి గరిటెలు గిన్నెలును గొనివచ్చెను.

చిన్నబల్లలమీఁద మా కొఱకుఁ బెట్టఁబడిన యల్పాహారములు భుజింపుఁడని గృహాధిపతి మమ్మంతట కోరెను. జిహ్వారుచులందును నామిత్రుఁడు శుద్ధబంగాళీయుఁడే. కాని నేనే సందిగ్ధావస్థలో నుంటిని! చిన్ననాఁట నుండియు నాకుఁ గారపువస్తువులందేయిష్టము. తీపి నాకు బొత్తిగ సరిపడదు. "మీయమ్మ నీకు బాల్యమున కారపుపా లిచ్చెనా!" యేమి యని చెలికాండ్రు నన్ను గేలిసేయుచుందురు! కాని స్వతస్సిద్ధమై యభ్యాసమున స్థిరపడిన మన రుచుల నెట్లు నిరోధింపఁగలము? కలకత్తావచ్చి నప్పటినుండి, కారపువస్తువులకు నేను మొకము వాచి, హరారా మొదలు కాళీఘాటు వఱకును గల యంగడులు గాలించితిని. కాఫీ త్రాగుట కలవాటుపడిన నానోటికి తేనీరు మట్టిబెడ్డ వలె నుండును! నేనిపు డేమి చేతును?

ఈఫలాహారములు తనముద్దులకూఁతురు గల్పించినవని ప్రఫుల్లబాబు నొక్కి చెప్పుట చేతను, భుజింపుడని యాబాల స్వయముగ వడ్డించుటచేతను, నేనొక రసికుల్ల విజిచితిని. గదిలోఁ బ్రవేశించునపుడు నే నాపాలఁతి నంతగఁ బరిశీలింపలేదు. ఇపుడు ప్రసంగించు నపుడాలలన వినయ లావణ్య సంపదలు విదితమయ్యెను. అంత గుణవతిని, సౌందర్యవతిని నే నెన్నఁడును జూచియుండలేదు. నవశిరీష కుసుమమును బోలిన శరీర సౌకుమార్యమునఁ జెన్నొందెడి యాచేడియ చిఱునగవులు లేఁత వెన్నెలలు వెదఁజల్లు చుండెను. నే నిపుడు గ్రోలెడియానందము, జిహ్వాకీనూతన భక్ష్యవిశేషము సమకూర్చుటవలనఁ గలిగినదా, లేక యీసుగుణసౌందర్యరాశి చక్షురుగ్రమునకుఁ బ్రసన్నమగుట వలననా? సువర్ణకంకణ శోభితములగు నీమెలఁత మృదుకరస్పర్శ మహిమమున నే సర్వసామాన్యములగు నీ యాహార పానీయము లింత రుచిరములైనట్లు గానఁబడెను!

"మోమోటము వదలి భుజింపు బాబుజీ! మేము నీవారమె గాని పరులము గాములే!" యని ప్రఫుల్లబాబు నన్ను ప్రోత్సహించుచు, తన

పూర్వీకులు ఆంధ్రదేశమునుండి వచ్చిరనియు, పూర్వపుపేళ్లు గృహనామములును నశింపఁగా నిపు డొకశాఖానామము మిగిలి మనుచుంటి మనియుఁ జెప్పెను.

“సరే! నియోగిబాబు లోకరికిద్దఱైనారు! నీరొట్టె నేతిలోఁ బడ్డది యిఁక పెండ్లికొడుకా! ఈవిందు అత్తవారింటి మనుగుడుపు అనుకొని కడుపునిండా మెక్కుము!” అని సమయము దొరికెనని యాధూర్తుఁడు, ఆదిశేషు, నన్ను పరిహాసము చేసెను. ఆ పలుకులు ములుకు లగుట నాకొకనికే కాదు. నునుసిగ్గుతో వకుళ పసిమిబుగ్గలొకింత తడవు అరుణకాంతులతోఁ దళుకొత్తెను.

ఫలాహారానంతరము ప్రఫుల్లబాబు, తన కుమార్తె బెతూనుకళాశాలలో విద్యనేర్చి తరగతిలో మిన్నగనున్నదనియు, ఒక మంద్రాజియాచార్యగురువు నొద్ద సంగీతము నేర్చుకొనుచున్నదనియుఁ జెప్పి, పుత్రిక దెసఁ దిరిగి, “వకుళా! ఏదీ క్రొత్తచుట్టములకు నీసంగీత రసాయనముకూడ నొకింత చవి చూపవా?” యని కోరఁగా, మరల నరుణోదయచ్ఛాయ లాపడఁతి పసిఁడి చెక్కులకుఁ బూఁతపెట్టెను!

మావంశీకులలో నొకరికి లేఁత వెన్నెల సోఁకిన శీతలము గ్రమ్ముచుండెడిదఁట! నాచెవులకు సంగీతము చప్పగఁ దోఁచుచుండును! నైజగుణమున కెవరేమి చేయఁగలరు? కాని, యా సాయంకాలము వకుళ వీణమీఁదఁ బాడిన త్యాగరాయకృతులు, సంగీతముపట్ల నాహృదయము నావహించిన మాంద్యమును బారఁద్రోలెను! ఆపొలఁతి పలుకుపలుకునకు తేనియ లొలుకుచుండుట, త్యాగరాజుని యపారభక్తిమహిమముననా, ఈమధురవాణి వాక్సుధారసప్రభావముననా యని నే నచ్చెరువొందితిని. సంగీతానంతరము, “వకుళా! నీగీత రసాస్వాదనము చేసిన క్రొత్తబందుగుల నుండి నీ కేమి కానుక కావలయును?” అని మేలమాడు జనకుని పంజరపుక్రంతలనుండి యజమానుని వ్రేళ్లు కొఱకఁజూచెడి చిలుకవలె, చుఱచుఱఁ జూచి, లజ్జాకోపములచే జేవుఱించిన ముఖకమలమున వకుళయట్టె గది విడిచిపోయెను!

౪

సౌఖ్యదినములు చయ్యనజరిగిపోవును. శీతకాలపు సెలవులు వేగమె ముగియఁగనే, నేను మరల చెన్ననగరప్రయాణము గట్టితిని. రెయిలులో స్వదేశమునకు వచ్చుచుంటినని నా కేలనో యిపుడిసుమంతయు సంతోషము లేదు. మరల కూవమహానది, అఱవస్నేహితులు, చెన్ననగరనివాసము—నాకు సిద్ధమయ్యెను! నాకలకత్తాప్రవాసము, బంగాళీయుల వదనబింబములు, ఆదిశేషుని సహవాసము, ఇపుడు నేను పయనముఁ జేసిన రెయిలుబండి నడకలవలెనే యతివేగముగఁ గాలగర్భమునఁ గలసిపోయెను. శీతకాలపుటుదయమున దట్టముగుపాగమంచు మైదానమునుగప్పరీతిని, సమయదేవత నానూతనానుభవములనెల్ల నంధకారబంధురమగు తన వదనగహ్వరమున వైచికొనెను.

కాని, యీపెనుజీఁకటి మధ్య తళుక్కుతళుక్కుమను దృశ్యమొకటి నామనోనేత్రము నెదుట సదా మెఱయుచుండును. అది నాకమితోత్సాహానందములఁ బ్రసాదించుచుండును. నాకుఁగల పెక్కు మనఃక్లేశములను, కష్టశోధనలను మఱపించెడి భావోద్రేకమును నాకుఁగలిగించుచుండును. అదియేదన, వకుళ కమనీయసురూపమును, కోకిలకూజిత సదృశమగు నామానిని మధురగానమును.

ఒకనాఁడు నేను కళాశాలనుండి బసకు వచ్చిచూడఁగా, నాకొఱకు రెండుఉత్తరములు గనిపెట్టుకొని యుండెను. అందొకటి నాప్రియమిత్రము ఆదిశేషువ్రాఁతతో నొప్పుచుండెను. రెండవ లేఖ యెవరిదో దస్తూరినిబట్టి గ్రహింపనలవిగాకుండెను. ఇదెవరువ్రాసిరాయని సంచించిందకయే నేనాలోచించితిని. నాపేరు ముందు "రాజశ్రీ"కిమాఱుగ "బాబు" అనియుండెను. హారిసనురోడ్డుముద్రయుండుటవలనఁగూడ, నా క్రొత్త కలకత్తా నేస్తకాం డ్రెవ్వరో వ్రాసియుందురనుకొంటిని. ఎవరువ్రాసిరి, విషయము లెవ్వి యని తెలిసికొనఁగోరి నేనంతమాత్రమున కాకితపుసంచి విప్పితిని. క్రింది సంతకము గుర్తుపట్టలేకపోతిని. ఇడియక్షరములతో జాబు లిఖింపఁబడియున్నను లోని విషయములు నాతలకెక్కినవిగావు. అవి నన్నుఁగూర్చిన సంగతులేమైనట్లున్నను, వ్రాయువారికి నావలనఁగావలసిన ప్రయోజనమేమియో గ్రహింపలేకుంటిని! ఆదిశేషు ఉత్తరముకవేళ దీనికి వ్యాఖ్యానమొసఁగింపఁగలఁడేమో చూతమని యది విప్పిచూచితిని. అది చదువునపుడు నాకనులు నేనమ్మజాలకుంటిని. నే నింకను కలకత్తాలో మిత్రుని యెదుట నుండునట్లును, అతఁడు తన సహజచమత్కారవచనముల నాప్రేయసి వకుళనుగూర్చి నాతో ముచ్చటించుచున్నట్టును, నేను కలగనుచుండుట లేదుగదా? లేదులేదు — నేను నిక్కువముగ మద్రాసుననే యుండి, నాకలకత్తామిత్రుని లేఖ చదువుచుంటిని. జాబులోని విషయము లేమిటి? ప్రఫుల్లచంద్రని యోగి, తనపుత్రిక వివాహమునుగూర్చి యాలోచించుచు, కూఁతుని కోరిక గనుగొమ్మని సతి నడుగఁగా నాఁడు తమ యతిథియైన యాంధ్రనియోగి యువకునిపై నాయువతి మనసునిలిపెనని తెలిసెననియు, తన యవలెనే తండ్రియు నాజవ్వానునిగూర్చి యభిప్రాయపడుచుండెననియు తేలెను. ఈ వృత్తాంతము నాకును, మాజనకునకును వ్రాసి, మా యభిప్రాయములుగనుగొనికాని, తనకుమార్తె పరిణయపుఁ బ్రయత్నములు సాగింప వలనుపడదని ప్రఫుల్లబాబు చెప్పుటచేత, ఆనాఁడే మా తండ్రికిఁగూడ సవిస్తరముగఁ దాను లేఖవ్రాసితిననియు, ఆసంగతి నాకును దామిచుపురును తెలియఁబఱచుచున్నా మనియు నాదిశేషు వ్రాసెను. ఇపుడు ప్రఫుల్లబాబు ఉత్తరము చదువఁగా, దాని యర్థము నాకు విస్పష్టమయ్యెను. ఇఁక నాకర్తవ్యమేమి?

ఓ

హా కలమిత్రుఁడా! నీవెపుడైన నమూల్యమగు కలగన్న, అందలి విషయములు తెలిసిన

వచ్చినతోడనె మటుమాయమగు ననుభయమున మంచమునంటిపెట్టుకొనియుండుట జ్ఞప్తి నున్నదా? నేనపు డిట్టియవస్థ నున్నాఁడను. వకుళ నేను గలలోఁగనిన పెన్నిధియె. నాజాగ్రదవస్థాగమనమె యద్దాని యనుభవమునకు ప్రబలశత్రువు ఎందువలన ననెదరా! నేను లోకమెఱుఁగని కళాశాలావిద్యార్థిని. వకుళ నా భాగ్యదేవతయనుట నిక్కమే. కాని, యేల్లును పూల్లునుగల వేలకొలఁదిమైళ్ల విశాలదేశము మా ప్రేమసాఫల్యమునకు ముఖ్యప్రతిబంధకము. పేరునకు నియోగియే కాని, అన్యజాతి మతాచారధర్మము లనుసరించిన బంగాళీకుటుంబపుఁ బడుచు వధువు. ఆంధ్రదేశమున పూర్వాచారపరాయణులగు వైదికశాఖవారిని తమ నిష్ఠచే ధిక్కరించెడిపద్ధతి నియోగిశాఖకుఁ జేరినవాఁడు వరుఁడు. ఎంతటి పరస్పరానురాగములతో నొప్పువారలయ్యును, ఇట్టి యువతీ యువకులకు దాంపత్యసంఘటనభాగ్యము దుర్లభము గదా!

౬

నాకు లేఖలు రెండును మాతండ్రికిఁ బంపి వేసితిని. నాయుద్దేశమును వెలిపుచ్చెడి యావంత మాటయైనను నేను తెలుపలేదు. ఏమని తెలుపువాఁడను? నా పట్టపరీక్షకుఁ బూర్వమే తలిదండ్రులు మంచి సంబంధ మొకటి కుదిర్చిరి. ఐన నేను పెండ్లికి పెడమొగము పెట్టుటచేత, నా కోరికను మన్నించి, వారు కార్యాచరణమునకు దిగకుండిరి. ఇంకఁ గొంతకాలమునకుఁ గాని నావిద్యాపరిపూర్తి కానేరదు. నా భక్తిగౌరవముల కాస్పదుఁడగు జనకుని యభిమతము పడయక యేమొగము పెట్టుకొని యీ విదేశాంగనను బరిణయ మయ్యెదను? మా నియోగిసంఘమునం దిటీవల విశాలభావములు కొంతవఱకు వ్యాపించియుండుట వాస్తవమే. ఐనను మొత్తముమీఁద సంకుచితసాంఘికాదర్శములుగల తలిదండ్రుల యభిప్రాయములను ప్రతిఘటించి, యెటు లీనూతనపద్ధతి వివాహమునకు సిద్ధపడఁగలను? కావున నీసందిగ్ధ సమయమందు మౌనమే యొప్పగుమార్గమని యెంచి, పొసఁగని నా ప్రేమచరిత్రకథనమునకుఁ బూనక మా జనకునికి పై లేఖ లంపి యూరకుంటిని. ఒక్కొకసమయమున మౌనమే పదియుపన్యాసముల పెట్టు! నాహృదయగత మగు కోరికలు గ్రహింప మా జనకుని సరసతకే వదలివైచి యూరకుంటిని.

ఒకవారము గడచెను. రెండువారములు జరిగెను. ఇప్పటికి మూఁడువారము లయ్యెను. ఎప్పుడు తపాలజవానువచ్చి, ఆకసమంటెడి నా ప్రేమ సౌధమును గూలఁద్రోచి నా వలపును మూన్నాళ్ల ముచ్చటగ నొనరించెడి లేఖను నా చేత నుంచునోయని నా గుండియలు జల్లుమనుచుండును. రెండుమాటలతో పరిసమాప్తి నొందింపవలసినకథ కింతటిజాగేల? "పుత్రకా, నీబాల్యచేష్ట లింకను వదలలేదేమి?" అను జనకుని సంక్షిప్తలేఖనముతో నాయాస లొక్కుమ్మడి యడుగంటునుగదా! ఈ కాలహరణమేల? ఇట్లు నేననుకొనుచుండఁగ నొకనాఁడు

మాతండ్రియుత్తరమువచ్చెను. నాప్రేమకథను వమ్ముఁజేసెడి యీలేఖ విప్పుటకు నా చేతులు వచ్చినవి కావు. సంచిచించునపుడు వినవచ్చిన సన్ననిచప్పుడు నాగుండియ లవిసిన ధ్వనివలెఁ దోఁచెను! నిరాశతో మనసు రాయిచేసికొని, నే నంత యుత్తరము చదువ సాహసించితిని. ఇదియేమిచిత్రము! లేఖ చదువునంత సేపును, నామనస్సు మర్త్యలోకముననే లేదు. ఏమి చదువుచుంటినో నాకుఁ దెలియదు. అరేబియను రాత్రులకథలలోని యలాయుడ్డీను నేల సొరంగమునఁ జొచ్చి నేత్రపర్వముగఁ గాంచిన విచిత్రదృశ్యములు నేఁ బొడఁగంటిని. కొండగుహలో ఆలిబాబాకంటఁబడిన కాంచన రత్నరాసులు నాకు దృగ్గోచరమయ్యెను. భానుబింబము పశ్చిమదిశ నుదయించునట్టును, వృక్షజాలము వియత్పథమునుండి పృథ్వికి వ్రేలాడునట్టును నాకుఁ దోఁచెను. సనాతన వైదిక ధర్మనిష్ఠాపరుఁడగు మాజనకుఁడే నా కీజాబు వ్రాసెను! ప్రఫుల్లచంద్రనియోగి, ప్రస్తుత దేశకాలపరిస్థితులను బట్టి బంగాళీయుఁ డని వ్యాప్తినొందియున్నను, సత్యమునకు స్వచ్ఛమగు నియోగివంశ సంజాతుఁడు, సజ్జన గరిష్ఠుఁడుననియు, ఆయనకుమార్తె తనకోడ లగుటకన్నివిధముల నొప్పియున్న దనియు, తాను బోయి స్వయముగ నీసంగతు లన్నియుఁ గనుగొంటిననియు, నాకీసంబంధముసమ్మతమైనచో నావివాహమునకుఁ దామందఱు నెదురుచూచుచుంటిమనియు, ఇవియే మాజనకుని లేఖావిషయములు. పిమ్మటి వృత్తాంతమంతయు రసజ్ఞులగు పఠితలే యూహించుకొనఁగలరు.

కోకిలగీతము

పోలూరు శ్రీమన్నారాయణయ్య, గంధ్రకోట సీతారామయ్యగార్లు

గున్నమామిడి చిగురుటాకులను మెక్కి,
కువలయానందముగఁ బాడుకొనెడి వేళ,
గానవిద్యాప్రవీణులౌ కవివరేణ్యు
లరయుచున్నారు; కోకిలా! హాయిఁజెంది.

కంఠమందలి తంత్రులఁ గదియఁజేర్చి,
విశ్వమోహనముగ నాలపించువేళ,
వినెడిభాగ్యంబ దే మానవునకుఁ గలదో
వానిజన్మము ధన్య మోవరపికంబ!!

ఎంగిలాకులజీవించు హీనమైన
యాత్మఘోషము నీగీతమహిత మనిన;
గానవిద్యాప్రవీణులౌ కవివరేణ్యు
లనుభవింతురు; నీదు గీతామృతంబు.

విరహిణులు కొంద ఱోర్వక వేళ నిన్నుఁ
బలువిధంబులఁ దిట్టినఁ బాటలోని
నీటు గోరంత తగ్గునే? యేటిమాట
లెవ్వరేమన్న నేమి? నీ కేమిలోటు?